క్లుప్తంగా

22న మండల సర్వసభ్య సమావేశం

ఈపూరు : మండల కేంద్రమైన ఈపూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రంగనాయకులు తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలోని ఆయా శాఖల పనితీరు, అభివృద్ధి పనులపై చర్చించడం జరుగుతుందని, కావున గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామంలో బీటెక్ విద్యార్థిపై కత్తితో దాడికి పాల్పడిన యువకుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తుళ్ళురి తిరుపతిరావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషనులో ఎస్సై మాట్లాడుతూ బీటెక్ విద్యార్థినిపై దాడి జరిగిన సత్వరమే నరసరావుపేట డీఎస్పీ కె.వి.మహేష్, వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్, ఎస్సై తిరుపతిరావు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దాడికి గల కారణాలు అడిగి తెలుసుకున్నామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



నరసరావుపేట రూరల్: గుర్తుతెలియని వ్యక్తి పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పెట్లూరివారిపాలెం సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు పెట్లూరివారిపాలెం–అచ్చమ్మపాలెం గ్రామల మధ్య గుర్తు తెలియని వ్యక్తి చనిపోయాడని గ్రామ వీఆర్ఓ ఇచ్చిన పిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ బాల నాగిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, బ్లూ కలర్ చొక్కా, బ్లూ కలర్ చొక్కా, తెలుపు, నీలి రంగు టవల్ ధరించి ఉన్నట్లు రూరల్ పోలీసు లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796244, 9440796225 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు కేబీఆర్ విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు కాసు బ్రహ్మానందరెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థి వై.మల్లిఖార్జున ఎంపికైనట్టు కేబీఆర్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు కృష్ణా జిల్లా నున్న జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి పోటీలలో మల్లిఖార్జున అండర్–19 విభాగంలో 60 కేజీల కేటగిరి (గ్రీకో రోమన్)లో బంగారు పతకం సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మల్లిఖార్జునను కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగిరెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ ఎ.వెంకటశివ, పిడి ఎం.వినీల్ అభినందించారు.

జగనన్న హయాంలోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

- ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకోవాలి
- వేర్వేరు ప్రాంతాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు



చిలకలూరిపేటలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలూరిపేట: అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు చెప్పారు. పట్టణంలోని 28,34 వార్డులతో పాటు మండలంలోని కావూరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయా సచివాలయాల వద్ద సంక్షేమాభివృద్ధి పథకాలు వివరించే బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావించి నాలుగున్నరేళ్ల కాలంలోనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని చెప్పారు. చరిత్ర ఎరుగని రీతిలో విప్లవాత్మక పాలనతో ప్రతి ఇంటికీ మేలు చేశారని వెల్లడించారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేశారని పేర్కొన్నారు. దేశమంతా మెచ్చుకొనేలా మన రాష్ట్రంలో సాధించిన పురోభివృద్ధిని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా ప్రజలకు ప్రభుత్వ సేవలను గడపవద్దే అందించటమే లక్ష్యంగా సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని చెప్పారు.నవరత్నాల పథకాల ద్వారా ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాల కల్పన, సామాజిక న్యాయ విధానంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించారని చెప్పారు. మహిళాసాధికారితకు పెద్ద పీట వేస్తూ మహిళలకు అన్నింటా సముచిత స్థానం సీఎం కల్పించారని కొనియాడారు. పట్టణంలోని 28వ వార్డులో ఇప్పటి వరకు రూ. 19.02 కోట్లు, 34వ వార్డులో రూ. 15.67 కోట్లు, కావూరు గ్రామంలో రూ. 30.35 కోట్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్ –1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్ –2 విడదల కమలేంద్ర, ఆయా వార్డుల కౌన్సిలర్లు ములకలూరి బాజీమున్ని, వడితే కోట్యానాయక్, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, పార్టీ చిలకలూరిపేట మండల అధ్యక్షుడు గుత్తా యాములయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వంకాలయలపాడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



బొల్లాపల్లి బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, సచివాలయ సిబ్బంది

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని సచివాలయంలో ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు వివరించే బోర్డును ఆవిష్కరించారు. బొల్లాపల్లికి సుమారుగా రూ.25. 85 కోట్ల మేర లబ్ధిచేకూరిందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి వైఎస్సార్ సీపీ నాయకులు అధ్యక్షత వహించి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ళ పాలనలో రాష్ట్రంలో 1.30 లక్షల మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని, సచివాలయ వ్యవస్థలో, వలంటీర్ల ద్వారా ప్రజలకు సేవలు చేరువలో అందాయన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమం దరిచేరిందని, ఆ ఘనత రాష్ట్ర ముఖ్యమంతి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ముఖ్యమంత్రి ఎందుకు కావాలంటే సంక్షేమ రథసారధిగా పథకాలు పార్టీలకు అతీతంగా అమలు చేసిన ఘనత ఆయనదేనని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బి. గురవయ్య, ఎస్. యాకోబు, బీమ్లా నాయక్, టి. నారాయణరెడ్డి, ఎస్. కాంతయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వంకాయలపాడు సచివాలయంలో..

యడ్లపాడు: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని.. సచివాలయాలు వలంటీర్ వ్యవస్థల ద్వారా నేరుగా లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు అందజేస్తున్నారని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే...కార్యక్రమం మండలంలోని వంకాయలపాడు గ్రామసచివాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 33 సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా పొందిన వివరాల బోర్డును అధికారులు, పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ ఘంటా శంకర్ మాట్లాడుతూ గత టీడీపీ, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే పరమావధిగా పారదర్శక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌పై విమర్శలు గుప్పిస్తున్న చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరాజు, జడ్పీటీసీ ముక్తావాసు, జేసీఎస్ మండల కన్వీనర్ రాచమంటి చింతారావు, సొసైటీ చైర్మన్ బసెల శివరామకృష్ణ గత నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, వంకాయలపాడు సచివాలయం పరిధిలో సీఎం జగన్ వల్ల జరిగిన మేలులను ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు షేక్ నాజులా, బింజు బుల్లెయ్య, ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, పాలిశెబుజ్జి, రవి, హుస్సేన్, ఖాదర్‌బాషా, లక్ష్మీనారాయణ, సీహెచ్ శ్రీధర్, ఎంపీడీవో ఈవోపీఆర్డీ వరూధిని, పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

చందవరంలో...

నాదెండ్ల: ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగున్నరేళ్ళ పాలనలో 99 శాతం హామీలతో పాటూ ఎన్నికల్లో ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. చందవరం గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.29,59,90,735లు నిధులు ఖర్చు చేసినట్లు పైలాన్ ఆవిష్కరించారు. ముందుగా వైఎస్సార్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. అక్కడే పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మిట్టమీద వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. పలు కాలనీల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, గణపవరం సొసైటీల అధ్యక్షుడు ఏడుకొండలు, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, పార్టీ నాయకులు చేరెడ్డి వెంకటరెడ్డి, ఆదిరెడ్డి, సుదర్శనం బాలస్వామి, గుర్రం ఉపేంద్రం, సింగారెడ్డి కోటిరెడ్డి, బూర్గురెడ్డి, బత్తుల సీతారామిరెడ్డి, గడ్డె కోటయ్య, పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూముల వివాదాలకు శాశ్వత పరిష్కారం




యడ్లపాడు: భూముల వివాదాలకుత శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు –భూరక్ష పథకం చేపట్టిందని తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు పేర్కొన్నారు. మండలలలోని గుత్తావారిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రీసర్వేపై గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూముల మాదిరిగానే గ్రామాల్లో నివాస గృహాల సర్వే (స్వమిత్వా) నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మండలంలో ఫేజ్–1 కింద ఎంపికైన గుత్తావారిపాలెంలో రీసర్వే కొలతలు పూర్తయి ఆయా భూముల వివరాలకు సంబంధించి ముసాయిదా ప్రకటించినట్లు చెప్పారు. గ్రామ పరిధిలో 6.82 ఎకరాల విస్తీర్ణంలో 232 పంచాయతీ పార్శిల్ నంబర్లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పీపీ నంబర్ల వారీగా గ్రామస్తుల భూముల వివరాలను సభలో చదివి వినిపించారు. సర్పంచ్ కల్లూరి సామ్రాజ్యం, ఈవోపీఆర్డీ వరూధిని, ఆర్ఐ చక్రవర్తి, వీఆర్వో నాగేంద్రబాబు, గ్రామసర్వేయరు విద్యాసాగర్, కారుచోల, గుత్తావారిపాలెం పంచాయతీ కార్యదర్శులు అంకయ్య, అనిత, గ్రామపెద్దలు పుటిగంపు వెంకటేష్, కొండమూడి వాసుబాబు, గుత్తా శ్రీరామమూర్తి, కల్లూరి సుబ్బారావు, గూడపాటి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల సెలవుపై వైద్యాధికారి ప్రియాంక

నాదెండ్ల: నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్న ప్రియాంక పీజీ కోర్సు చేసేందుకు మూడేళ్ల సెలవుపై వెళ్ళారు. మంగళవారం ఆమె విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం రెండో వైద్యాధికారిగా పనిచేస్తున్న సాయిశ్వేతతో పాటూ బుధవారం మరో వైద్యాధికారి ఇక్కడ విధుల్లో చేరనున్నారు. ప్రియాంక 2019 జనవరిలో వైద్యాధికారిగా విధుల్లో చేరారు. ఆమెను పీహెచ్‌సీ సిబ్బంది ఎంహెచ్ఏఎం వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం జోజమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ రాధిక, 104 డీఈవో పవన్‌కుమార్‌రెడ్డి, డ్రైవర్ సాంబశివరావు అభినందించారు.

ఆలయాలు కిటకిట



గంటావారిపాలెంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం



నరసరావుపేటలో ప్రత్యేక అలంకరణలో కల్యాణ సుందరేశ్వర స్వామి



గణపవరం నూతన రామాలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ప్రారంభమైన కార్తిక పూజలు

నరసరావుపేట ఈస్ట్: పవిత్ర కార్తిక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శైవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు చేరుకొని దీపాలను వెలిగించి పూజలు జరిపారు. పాతూరులోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయం, రావిపాడురోడ్డులోని శ్రీపార్వతీ సమేత కళ్యాణ సుందరేశ్వరస్వామి ఆలయం, బరంపేటలోని శ్రీరాజరాజేశ్వరీ సమేత వాయు మల్లేశ్వరాలయం తదితర ఆలయాలలో భక్తులు పూజలు జరిపారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం, కారుమంచి, మతుకుమల్లి, వేల్పూరు, శావల్యాపురం, పోట్లూరు, తదితర గ్రామాల్లోవేంచేసియున్న శివాలయాల్లో మొదట కార్తికమాసం ప్రారంభం కావటంతో భక్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున చల్లని నీటితో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మట్టి ప్రమిదల్లో, ఆవు నెయ్యి పోసి దీపాలు వెలిగించారు. శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, రుద్రాభిషేకం తదితర విశేష పూజలు ఆలయ అర్చకస్వామి సాయి భరత్ ఘనంగా నిర్వహించారు. కార్తికమాసం పురస్కరించుకొని నియమ నిష్టలతో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసాలు ఉన్నారు. శివాలయంలో శివలింగాలను ప్రత్యేకంగా పూలమాలలు వెండితోరణాలతో అలంకరణ చేశారు. మాలధారణలో ఉన్న అయ్యప్పలు,భవానీలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న అడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి దేవాలయంలో కార్తిక మాస వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ధ్వజస్తంభాల వద్ద ఆకాశ దీపారాధన

నాదెండ్ల: కార్తీక మాసం మంగళవారం నుంచి ప్రారంభం కావడంతో అన్ని దేవాలయాల్లో మహన్యాసక పూర్వ రుద్రాభిషేకం, అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి ధ్వజస్తంభం ఉన్న ప్రతి ఆలయం వద్ద ఆకాశ దీపారాధన చేశారు. ఆకాశ దీపాన్ని తిలకించేందుకు భక్తులు ఆలయాల వద్దకు భారీగా చేరుకున్నారు.గణపవరం కోదండనగర్‌లోని రామాలయంలో పూజారి గిరిజానంద కుమార్ ఆధ్వర్యంలో ఆకాశ దీపారాధన చేశారు. నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో అభిషేకాలు అనంతరం చేసిన ఆకాశ దీపారాధన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ నెల 20వ తేదీన నాగుల చవితి సందర్భంగా సర్ప సూక్త హోమం నిర్వహించనున్నారు.

జనం రాలేదని రాయటం సిగ్గుచేటు



సోమవారం ఐదో వార్డులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



హాజరైన ప్రజలు

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఈనెల 20న నిర్వహించబోయే సామాజిక సాధికారిక బస్సుయాత్ర విజయవంతాన్ని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం నిర్వహించిన సదస్సుకు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా మంగళవారం పేర్కొన్నారు. సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యేకు అందరూ నిలబడి ఏకకంఠంతో ఘనస్వాగతం పలికారన్నారు. స్థానిక ఐదో వార్డులో రెండు, మూడు, ఐదో వార్డుల ప్రజలతో సమావేశం నిర్వహించటం జరిగిందన్నారు. యాత్ర గురించి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారన్నారు. ఈ సమావేశానికి లబ్ధిదారులు, ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, వార్డుల ప్రజలు భారీగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారన్నారు. కానీ ఓ దినపత్రిక (సాక్షిలో కాదు)లో జనం లేరని, నాయకులు ఫోన్‌చేసి జనసమీకరణ చేశారని అవాస్తవాలు రాశారని పేర్కొన్నారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్సీ సామాజిక వర్గం, మైనారీలు అత్యధిక సంఖ్యలో హాజరుకాగా ఆ పేపర్‌లో వచ్చిన వార్తను చూసి అందరమూ ఆశ్చర్యచకితులయ్యామన్నారు. ఇంత అన్యాయం ఎప్పుడూ తాము చూడలేదని, అవాస్తవాలు రాయటం సిగ్గుచేటన్నారు. వాస్తవాలు తెలుసుకొని రాయాలేకాని అవాస్తవాలు రాయటం మంచిది కాదని హితవు పలికారు. కార్యక్రమం విజయవంతంపై ఓర్చుకోలేని ఎల్లో మీడియా ఈ అవాస్తవాలు రాసిందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జగనన్న సురక్ష శిబిరంలో 213 మందికి వైద్యసేవలు



శిబిరంలో వైద్యం చేయించుకునేందుకు వచ్చిన వారికి బీపీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నరసరావుపేట: స్థానిక బరంపేట పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 213మంది వార్డు ప్రజలకు డాక్టర్లు, సిబ్బంది వైద్య సేవలు అందజేశారు. వీరిలో 126 మంది మహిళలు, 68 మంది పురుషులు, 19 మంది పిల్లలు ఉన్నారు. డాక్టర్లు ప్రియాంక, ఆషాలత, మురళీకృష్ణ వైద్యసేవలు అందజేయగా ఎంవీ రెడ్డి కంటి హాస్పిటల్ సిబ్బంది కళ్లపరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది శిభిరానికి వచ్చిన వారికి మధుమేహం, బీపీ, రక్తపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరం నిర్వాహణకు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైద్య సిబ్బంది సహకారం అందజేశారు. బరంపేట ప్రాంతం ఎక్కువగా ఉండటం వలన ప్రభుత్వ ఆదేశానుసారం బుధవారం కూడా శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలియచేశారు.

పాలపాడులో జగనన్న సురక్ష వైద్య శిబిరం

నరసరావుపేట రూరల్: మండలంలోని పాలపాడు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 344 మంది శిబిరానికి హజరైయ్యారు. వీరిలో కంటి సంబంధిత సమస్యల తో బాధపడుతున్న 141 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 51 మందికి కళ్లజోళ్లు అవసరమని సూచించా రు. కోటప్పకొండ, పమిడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ జోయల్‌ప్రసాద్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ జె.శ్రీనివాసరెడ్డిలు రోగులకు పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ రామి రెడ్డి, గ్రామపెద్దలు చెంచురెడ్డి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ కె.విప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌వలి పాల్గొన్నారు.

19న నిదానంపాటి లక్ష్మి అమ్మవారి తిరునాళ్ళ

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న నిదానంపాటి లక్ష్మి అమ్మవారి తిరునాళ్ళ వేడుకలు ఈనెల 19న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. మద్దినేని హరి బాబు, కేతేపల్లి వెంకటేశ్ సారథ్యంలో మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు.

ఘనంగా బాలల దినోత్సవం



వినుకొండ ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న జోసెఫ్‌కుమార్

నరసరావుపేట రూరల్: బాలల దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చినతురకపాలెంలో మాజీ సర్పంచ్ పాదిలే ఖాజా ముఖ్యఅతిథిగా పాల్గొని ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఉప్పలపాడులోని శాఖా గ్రంథాలయంలో మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ యన్నం వెంకటనర్సిరెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు.

నాదెండ్లలో..

నాదెండ్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవం నిర్వహించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏటా బాలల దినోత్సవం జరుపుకోవటం విదితమే. గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకూ కొనసాగింది.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె. అపర్ణ, ఎస్. అలీషా, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: బాలల దినోత్సవ వేడుకలు మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులను అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్ డైరెక్టర్, కరస్పాండెంట్ పోపూరి వెంకటేశ్వర్లు, బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ సృజన పాల్గొన్నారు.

వినుకొండలో..

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, పాపసాని బ్రహ్మయ్య, నంది నరసింహారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్వినోమ్, సొసైటీ అధ్యక్షులు నాసరరెడ్డి, పొట్లపల్లి పిచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, తలారి ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: విద్యకు విలువలు జోడించి విద్యాబోధన చేస్తే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం బాలల దినోత్సవం వేడుకలు సందర్భంగా స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో విద్యార్థులతో ఆట పాటలతో కోలాహలంగా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించారు.

వాడవాడలా గ్రంథాలయ వారోత్సవాలు



వినుకొండలో నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు శాఖా గ్రంథాలయాల్లో మంగళవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు సంతగుడిపాడు గ్రామ సర్పంచ్ ఉయ్యాల సీతమ్మ, రొంపిచర్ల మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డిలు పూలమాలలు వేసి నివాళిలు అర్పించారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేట: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బాలల దినోత్సవం నిర్వహించారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కీర్తి హాల్ వద్ద ఉన్న వినుకొండ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి భూక్యా బద్రినాయక్ ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన కౌన్సిలర్లు షేక్ షకీలా దస్తగిరి, షేక్ దిల్షద్‌లు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: విద్యార్థులంతా గ్రంథాలయాలను సందర్శించి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సర్పంచ్ కారుచోల హేమ చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడు శాఖ గ్రంథాయంలో ఏర్పాటు చేసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆమె పాల్గొని జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వై.సంజీవరావు, శివరామకృష్ణ, ముత్తవరపు సాంబశివరావు, సీతారామయ్య పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో గల శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీటీసీ తుర్లపాటి చౌదయ్య పాల్గొని ప్రసంగించారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయ శాఖ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు శావల్యాపురం గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ తెలిపారు. మంగళవారం తొలిరోజు బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం నేత మాజీ విద్యాకమిటి చైర్మన్ పద్మనాభుని హనుమంతరావు పూల మాలల నివాళీ అర్పించారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: పుస్తక పఠనంతో గొప్ప జ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చని ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ చెప్పారు. నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. ముందుగా చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మి, లైబ్రేరియన్ రావూరి శ్రీనివాసరావు, ఎంఈవో ఆంజనేయులు, పాల్గొన్నారు.